


"అయ్యో నాతల్లీ! గడపలో అడుగుపెట్టి గడియ సేపన్నా అయిందో లేదో అప్పుడే విచారించావేమే హనుమాయమ్మ యోగ క్షేమం!" అంది అమ్మ. అమ్మ ఇట్టా అనుకోకుండా ఉండేట్టు అడ గాలని చాలా ప్రయత్నించాను అయినా అది మాత్రం అనతగ్గ మాటేదో అనకండా ఊరుకోలేదు.

నాయనమ్మ వెంటనే అందుకుని, "ఇం కెక్కడి హనుమాయమ్మే! పాపం చచ్చిపోయింది కాదుటే అమ్మా!" అంది విచారిస్తూ.

"ఎప్పుడే!" అన్నాను ఒక్కసారిగా.

"ఇప్పుడేం! చాలా రోజులైంది. నువ్విక్కడినుంచి వెళ్ళిన కొత్తలోనే" అని ఒకసారి సానుభూతి సూచకంగా ఒక నిట్టూర్పు విడిచి, "ఏదో పెద్దముండ పోయిందనన్నా లేకండా చచ్చిం తరవాత కూడా పగతీర్చుకున్నారే! దాన్ని కాటికి చేరెయ్యటానికి ఎంత రాద్ధాంత చేశారు! ఎంత రాద్ధాంతం చేశారు!" అంది నాయనమ్మ.

"అత్తారివైపువాళ్ళు అంత బలగం అన్నారుకాదే? పోయిం తరవాతకూడా దగ్గిరికి రాలేదన్నమాట!" అన్నాను నేనుకూడా విచారిస్తూ.

"వాళ్ళొస్తారుటే! కటికముండా కొడుకులు కారుటే వాళ్ళసలు!" అంది నాయనమ్మ.

ఇంతలో అమ్మ అందుకుని "ఏనాడో ఇల్లు వదలిపెట్టి దేశ దేశాలూ తిరిగి, ఇన్నాళ్ళూ ఆయింటా, ఆయింటా అడుక్కు తింటున్న ముండ చస్తే వాళ్ళకేం పట్టిందంట కావిలించుకు రావటానికి?" అని చల్లగా అంటించింది.

హనుమాయమ్మగారి విషయంలో తరుచు అమ్మ, నాయనమ్మల మధ్య ఇట్లామాటమీదమాట అనుకోటాలు జరుగుతుండేవి. హనుమాయమ్మ నాయనమ్మకి తోడుగా వుండేది. ఎక్కడన్నా భోజనంచేసి రాగానే సాయంత్రంవరకూ వాళ్ళిద్దరూ మాటాపలుకూ ఆడుకుంటూనో, ముసలివాళ్ల పాటలు పాడుకుంటూనో గడిపేవాళ్లు. తరుచు రాత్రిళ్ళుకూడా మాయింటోనే పడుకునేది హనుమాయమ్మ గారు. పెద్దముండకదా అని ఏమన్నా చేసుకుంటే ఆవిడ చేతులో కూడా ఇంతపడేస్తూ ఉండేవాళ్ళం. నా చిన్నప్పటినించీకూడా నాయనమ్మ దగ్గిర పడుకుని వాళ్ళమాటల్లో మధ్య మధ్య నేనుకూడా మాటలు కలిపేదాన్ని. ఇదంతా లోపల్లోపల అమ్మకి కోపంగా ఉండేది. అయినా గట్టిగా ఎవర్నీ ఏమీ అనేదికాదు.

క్రమంగా నేను పెద్దదాన్నవుతున్నకొద్దీ హనుమాయమ్మగారి జీవిత విశేషాలు చాలా వరకు తెలుసుకున్నాను. కొంత మా నాయనమ్మ చెప్పింది. మరికొంత హనుమాయమ్మగారే చెప్పింది నాబల వంతంమీమ్మీద. తన దుర్భర చరిత్రనంతనీ సానుభూతితో విన్నందుకో యేమో నేనంటే ఆవిడకి చాలా ఆపేక్షగావుండేది. పోయేముందు నా కోసం ఎన్నోసార్లు కలవరించిందని నాయనమ్మ చెప్పింది. చివరి

సారి నేను చూడలేక పోయానని నామనస్సు చాలాసార్లు చివుక్కు మన్నది. మనం ఆవిడ జీవితాన్ని స్థూలంగా పరిశీలిస్తే.... ఆనాటి ఆవిడ జీవితంలో కొందరు వ్యక్తులు ప్రవేశించి, దాని గమనాన్ని నిర్ణయించిన వాళ్ళు కనపడతారు.

## సీ తా రా మ య్య

హనుమాయమ్మగారిభర్త. ఆకాలంలో కాబట్టి....హనుమాయమ్మగారి పెళ్ళినాటికి ఈయనకి దాదాపు పాతికేళ్ళున్నాయట. అప్పుడు హనుమాయమ్మగారికి పదేళ్ళు మాత్రం !

చాలా రోజులకు పెళ్ళవటంవల్ల హనుమాయమ్మ పెద్దమని షవటం తడవుగా అన్నీ ముగించామనిపించి కాపరానికి తీసుకొచ్చారట్ట సీతారామయ్యగారు. అప్పటికి హనుమాయమ్మగారికి గట్టిగా పన్నెండేళ్ళు నిండినవ్వో లేదో అంట !

కాపరాని కొచ్చిన నాటికి హనుమాయమ్మగారి అత్తారింటి తీరు అదో మాదిరిగా ఉండేదిట. మామగారు మంచానపడి ఉండేవాడట. అత్తగారు పొద్దస్తమానం ఆయనమంచంముందు కూర్చోటంతోనే సరిపోయేదిట ఇంటిపనులన్నీ తనేచేస్తున్నా అత్తగారు ఎక్కువ చిరాకుతో అయిన దానికీ కానిదానికీ కస్సుబుస్సుమంటూ ఉండేదిట.

దీనికి తోడు భర్తతో సయోధ్యకూడా అంతంత మాత్రంగానే ఉండేదిట. కాని, ఈ విషయాన్ని గురించి నాకు ఆవిడేమీ సరిగ్గా చెప్పలేదు. ఆవిడ మాటల తీరునిబట్టి వాళ్ళిద్దరి సంబంధాన్ని గురించిన కొన్నివిషయాలు దాస్తున్నట్టు తెలుసుకున్నాను. సీతారామయ్యగారికున్న ఈలోపానికి తోడు హనుమాయమ్మగారికి వయసొస్తున్న కొద్దీ ఆవిడంటే ఒక విధమైన ఈర్ష్య, అసూయ కనపరిచే వాట్ట. ఇది క్రమంగా చీటికీ మాటికీ చావబాదటంలోకి దిగిందట. ఇంట్లో ఉంటే లోపలేదో గూడుపుఠాణీ చేస్తున్నావనీ, వసారాలో ఉంటే వీధికెక్కావనీ... ఇట్టా వేధించుకు తింటం మొదలు పెట్టాట్ట!

అంతేకాకండా సీతారామయ్యగారికి ఇంటి ఎదురుగా ఉన్న గురునాథం మీద అనుమానంకూడా మొదలైందిట. ఒకనాడు హనుమాయమ్మగారు చక్కగా తల దువ్వుకుని సింగారించుకునే సరికి సీతారామయ్యగారు మండిపడి చచ్చేట్టు కొట్టాట్ట!

## గు రు నా థ ం

నెమ్మదిగా ఆవిడదృష్టి గురునాథంవైపుకే మళ్ళిందిట! ఆ రోజుల్లో మగవాళ్ళకి తేలిగ్గా పెళ్ళిళ్లు అయ్యేవికావుగా!- అందువల్ల ఈయన బ్రహ్మచారి! సమయంకల్పించుకుని సరసంగా మాటలు విసరటం మొదలు పెట్టేవాట్ట. మొట్టమొదట ఈయన్ని చూస్తే భయము, అసహ్యము.... వేసేవిట హనుమాయమ్మగారికి. ఆవిడ ఈ విషయాలన్నీ ఎవరికీ భయపడవలసిన అవసరంలేని తన వృద్ధాప్యంలో చెప్పింది గనక అబద్ధాలు కావని మనం గట్టిగా నమ్మవచ్చు.

తరవాత, తరవాత గురునాథం అంతమంచివాడు కాడని తెలుసుకున్నానంది హనుమాయమ్మగారు. ఆయనతో సహచర్యాన్ని ఎంతో మురుసుకుంటూ చెప్పింది ఆవిడ. గురునాథంగారు ఎంతో ఆపేక్షగా ఉండేవాట్ట.

గురునాథంగారు హఠాత్తుగా చనిపోయిన సంగతి అంతపెద్దదైనా కళ్లనిండానీళ్లతో నిన్నా, మొన్నా జరిగినదానికి విచారిస్తున్నట్టు చెప్పింది హనుమాయమ్మగారు. ఎన్నిసార్లు చావబాదినాసరే హనుమాయమ్మగారిని గురునాథంనుంచి వేరుచెయ్యలేక పోయాట్ట. అన్ని దెబ్బలు కొట్టినా హనుమాయమ్మకేమీ అనిపించేది కాదుట ఆరోజుల్లో! ఆవిడ జీవితంలో ఎక్కువ సంతోషం పొందింది గురునాథంతో ఉన్నప్పుడేనని చెప్పింది చివరికి. గురునాథం పోయే నాటికి వీళ్ళిద్దరి సంబంధం ఊళ్ళో అందరికీ తెలుసుట.

## వీ రా స్వా మి

గురునాథం హఠాత్తుగా మరణించటంతో హనుమాయమ్మ గారి జీవితంలో ఏర్పడ్డ లోపం చాలారోజుల తరవాత వీరాస్వామితో తీరింది. ఇదికూడా కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో జరిగింది.

హనుమాయమ్మగారు గురునాథం మరణాన్నిగురించి క్రమంగా మరిచిపోతున్న సమయంలో వీరాస్వామి వాళ్ళింటో కమతాని కుండేవాట్ట. వాళ్ళదొడ్లో పూచినయ్యాని ఒకబుట్టెడు మల్లెపూలు తెచ్చాట్ట వీరాస్వామి ఒకనాడు తను పెట్టుకోటానికి. ఇన్నిపూలు, పెట్టుకుంటే చూడాలనుకునే ఒకమనిషి ఉన్నట్టు అప్పుడు హనుమాయమ్మ గారు గ్రహించి ఉంటుంది. అప్పటికి సీతారామయ్యగారు సరిగ్గా ఇంటిపట్టున ఉండటం మానేసి చాలా రోజులైందిట. అవన్నీ దండగా గుచ్చి చక్కగా పెట్టుకుందిట. తను కాపరం చేస్తున్న ఇన్నాళ్ళల్లోనూ ఎన్నడూ కాసిని మల్లెపూలంటూ పట్టుకొచ్చి సీతారామయ్యగారు ఇచ్చిన పాపాన పోకపోవటంవల్ల, హనుమాయమ్మకు వీరాస్వామి అంటే అభిమానం చూపిందంటే ఆశ్చర్యంలేదు. అతనిమీద మోజు కలిగింది ఇన్నాళ్ళకు !

నెమ్మదిగా వాళ్ళిద్దరి సాంగత్యం ఎక్కువైంది. ఇటువంటి విషయాలు ఎక్కువ కాలం దాగవు. కాబట్టి సీతారామయ్యకికూడా తెలిసింది. హనుమాయమ్మను స్పృహతప్పేట్టు కొట్టాట్ట. ఎందులో నన్నాపడి చద్దామనుకుందిట, చావలేదు... ఇంటినించి బయలుదేరి వీరాస్వామితో వచ్చేసిందిట.

## సు బ్ర హ్మ ణ్యం

ఇంటినించి వచ్చెయ్యటంవల్ల ఉన్న కష్టాలు తెలుసుకోటానికి ఎక్కువకాలం పట్టలేదు హనుమాయమ్మగారికి. బస్తీచేరిన కొద్ది రోజులకే తనువస్తూ తెచ్చినడబ్బు, వీరాస్వామికూడా తననుంచి మాయమై పోయారు.

పొట్టబాధ ఎక్కువై ధనసంపాదనకి తను చెయ్యగల పనేమిటని ఆలోచించటం మొదలు పెట్టిందట హనుమాయమ్మ. వంటలు తప్పితే మరేం చెయ్యగలదు ఆ పల్లెటూరు మనిషి ?

చివరికి సుబ్రహ్మణ్యంగారింట్లో వంటకి కుదిరిందట. ఆయన భార్య రోగిష్టి, తగని అనుమానంమ్మనిషి. దానికి తగ్గట్టు సుబ్రహ్మణ్యంకూడా వీలుచూచుకుని బలవంతం చెయ్యటం మొదలు పెట్టాట్ట హనుమాయమ్మను.

తనమీద తన కధికారం లేకండా దిగజారిపోయిన హనుమమ్మ ఊరుకోక తప్పిందికాదు. పర్యవసానం, సుబ్రహ్మణ్యం భార్యపడుతున్న వ్యాధి సూచనలన్నీ హనుమాయమ్మలోకూడా కనపడినయ్యిట.

## శే షా వ తా ర ం

ఈయన హనుమాయమ్మగారిని పడుపు గృహంలో కలువుకున్న విటుడు.

హనుమాయమ్మ సుబ్రహ్మణ్యంగారింటో వంట మానేసి ఒక రోజల్లా అటూ, ఇటూ తిరుగుతూ ఆలోచించిందిట ఏమిటి చెయ్యాటమని. కాలం గడుస్తున్నకొద్దీ కడుపుతొందర పెడుతోంది. ఆకలి తీర్చమని చివరికి తన నిర్ణయంతో నిమిత్తం లేకుండా పడుపు గృహంలో చేరిందిట. మొదటి రోజుల్లో అక్కడ సౌకర్యాలన్నీ బాగానే జరిగేవిట. శేషావతారంకూడా కేవలం స్వసౌఖ్యం కోసమే అక్కడికి వస్తున్నవాడు కనక హనుమాయమ్మ సౌఖ్యాన్ని గురించి తెలుసుకోవాలని ఆమెను ఆటే బాధపెట్టేవాడు కాదుట ! రోజులు గడుస్తున్నకొద్దీ పడుపుగృహాలంత నరకభూయిష్టమైన ప్రదేశాలు ముల్లోకాల్లోనూ మరెక్కడా ఉండవని తెలుసుకుందిట శేషావతారంకూడా అక్కడికి రావటం ఒక్కసారి మానేశాట్ట.

## కో ట య్యా

శేషావతారం రావటం మానెయ్యటంతో ఆయింట్లోకూడా తనకు ఆదరణ తగ్గిపోయిందిట.

తరవాత కొంతకాలం కోటయ్యా అప్పుడప్పుడు వస్తూఉండే వాట్ట. ఈయన బాగాఉన్నవాడుకాదుట. వచ్చినంతా రాబట్టుకోటమే ముఖ్యమని గ్రహించిన కటికవ్యాపారి కనక తన యజమానురాలు హనుమాయమ్మను కోటయ్యా దగ్గరికి పంపుతూ ఉండేదిట. ఇట్టా గడిచిందైనా కొద్దిరోజులే.

## ర వూ ఫ్

ఇతన్నిచూస్తే హనుమాయమ్మ యజమానురాలుకూడా భయపడేదిట. వచ్చినప్పుడల్లా ఇల్లంతా ఒక కొలిక్కితెచ్చి మరీ వెళ్ళిపోతూ ఉండేవాట్ట. హనుమాయమ్మ ఆనరకాన్నుంచి తొందరలో బయటపడటానికి ఇతనివల్ల భయమే కారణమట. మళ్ళీ ఒకసారి హనుమాయమ్మ ఒంటరిగా ప్రపంచంలో నిలబడింది.

*　　*　　*　　*

హనుమాయమ్మగారి స్వీయచరిత్రలో ముఖ్యఘట్టాలు సవివరంగా ఇంతవరకు మాత్రమే విన్నాను. తరవాత నేను మాఅత్తారింటికి వెళ్ళాను. మళ్ళీ తిరిగి వచ్చేటప్పటికి ఆవిడ లేదు.

ఇంకా ఆవిడ వయస్సులో కొంత కాలాన్ని తమవశం చేసుకున్న వాళ్ళు చాలామంది ఉన్నారుట—చెంచయ్యా, నారాయణమూర్తి, కోటిలింగం—కాదు. కోటిలింగం తరవాతే నారాయణమూర్తి... ఇంకా ఎందరున్నారో నాకు ఇప్పటికీ తెలీదు.

చివరి రోజుల్లో హనుమాయమ్మ మళ్ళీ ఈఊరు చేరింది. అంతా ఎరుగున్నవాళ్ళు కావటంవల్ల, తనవాళ్ళు రానియ్యకపోయినా, పెద్దముండ అని జాలితలచి పెట్టిన వాళ్ళింటోతిని అక్కడక్కడా తల

దాచుకునేది. మా నాయనమ్మ బోటి వాళ్ళకి కాలక్షేపానికి బాగా పనికివచ్చేది.

ఇంట్లో సౌఖ్యం దొరక్క హనుమాయమ్మ సౌఖ్యం నెతుక్కుంటూ తిరిగి తిరిగి పాతాళానికి ఎట్లాదిగజారిందో తల్చుకుంటుంటే కడుపు తరుక్కు పోతుంది. నాయనమ్మని ఒకసారి అడిగాను. "నాయనమ్మా! మరి సీతారామయ్యగారు తరవాత పెళ్ళి చేసుకున్నట్టే? 'అని.

"చేసుకోకేమేలమ్మా! తరవాత ఒకటి కాదు, రెండు కాదు.... నాలుగు పెళ్ళిళ్లు పెటాకులు వేగించుకున్నాడు. అణిగి మణిగి కాపరం తగలపెట్టింది ఒక్కతే లేదు కాని! ఇంతకీ ఒక్కొక్కళ్లు చేసుకున్న ఖర్మ" అంది.

నేనప్పుడప్పుడూ అనుకుంటూ ఉంటాను - హనుమాయమ్మగారి స్త్రీత్వాన్ని రుజువు చేస్తూ ఇంతమంది సాక్షులుండగా, అయిదు పెళ్ళిళ్లు చేసుకునికూడా ఒకళ్ళతోనూ సవ్యంగా కాపరం చెయ్యలేక పోయిన సీతారామయ్యగారిని లోకం ఎందుకు దోషిగా భావించదా అని.

